క్లుప్తంగా

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి గ్రామోత్సవం

చెన్నూరు : మండలంలోని రామనపల్లె గ్రామంలో తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకొని మంగళవారం రాత్రి గ్రామంలోని పురవీధులలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి గ్రామోత్సవం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. మేళతాళాలతో బాణాసంచా పేలుస్తూ గ్రామస్తులంతా స్వామివారి రథోత్సవాన్ని లాగారు.గ్రామోత్సవంలో వీరబ్రహ్మేంద్ర స్వామికి జై.. గోవిందమాంబకు జై నినాదాలు మిన్నంటాయి.

నేడు ఎర్రగుంట్లకు ఎంపీ రాక

ఎర్రగుంట్ల : మండల కేంద్రమైన యర్రగుంట్ల పట్టణంలోని 10,11,12,13,19 వార్డులలో ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టరు మూలె సుధీర్‌రెడ్డి బుధవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్, మున్సిపల్ చైర్మన్ ఎ.హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ వార్డులలో వారితో తాను కూడా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తామన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు వైఎస్ఆర్‌సీపీ ఎన్నికల ప్రచారం

వల్లూరు : మండలంలోని వల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి వైఎస్ఆర్‌సీపీ ఎన్నికల ప్రచారం జరుగుతుందని ఆ పార్టీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ పరిధిలోని సీ కొత్తపల్లె, లింగాయపల్లె, పాత గాలివారిపల్లె గ్రామాల్లో జరిగే ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే పి. రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మెన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి పాల్గొంటారని తెలిపారు.

నేడు అల్లాడుపల్లె, వెదురూరులో వైద్య శిబిరం

చాపాడు: మండల పరిధిలోని అల్లాడుపల్లె, వెదురూరు గ్రామాల్లో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. అల్లాడుపల్లెలో వైద్యాధికారి కావ్యమాధురి, వెదురూరులో వైద్యాధికారి ఓబులేసు వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఆయా గ్రామాల పరిధిలోని ప్రజలకు వైద్య పరీక్షలు చేసి.. మందులు అందజేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చౌడేశ్వరీ దేవికి 2 కిలోల వెండి కానుక



ఆలయ చైర్మన్ నాగశయనంకు వెండి అందజేస్తున్న దాతలు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక మేదరవీధిలోని శ్రీరామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలో మంగళవారం అమ్మవారికి ఆభరణాల తయారు చేసేందుకు రూ.1.60 లక్షలు విలువచేసే రెండు కిలోల వెండిని దాతలు ఆలయ కమిటీ అధ్యక్షుడు వుట్టి నాగశయనంకు అందచేశారు. దాతలు మందల పాల వెంకటరాఘవేంద్ర, సతీమణి సుష్మ, కుమార్తె ఆధ్య, మాలెపాటి రవితేజ సతీమణి సుధామాధురి అమ్మవారికి ఆభరణాల కోసం వెండి వితరణ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాతలను శాలువ కప్పి ఆలయ చైర్మన్ సత్కరించారు. ఆలయ కమిటీ కార్యదర్శి శ్రీనివాసులు, మెంబర్లు లక్ష్మీనారాయణ, గిద్దలూరు ఈశ్వరయ్య, మచ్చా వెంకట సుబ్బరాయుడు, శివప్రసాద్, రామకృష్ణ, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే కవుల లక్ష్యం



కవులను సన్మానిస్తున్న నిర్వాహకులు

ప్రొద్దుటూరు కల్చరల్: కవులు సామాజిక అంశాలను రచించి ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా కృషి చేయాలని కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డీకే చదువులబాబు సూచించారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లోని గ్రంథాలయంలో క్రోధినామ సంవత్సర ఉగాది సందర్భంగా రామరాజభూషణ సాహితీ పీఠం ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ కవులు ప్రకృతి అందం, స్వచ్ఛత, ఓటు ప్రాముఖ్యత, సామాజిక బాధ్యతలపై రచనలు చేసి ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. క్రోధినామ సంవత్సరంలో క్రోధ భావం లేకుండా కుటుంబసభ్యులతో పాటు ఇరుగు పొరుగు వారితో సఖ్యతగా మెలగాలన్నారు. రామరాజభూషణ సాహితీ పీఠం నేటి తరానికి సాహిత్యాన్ని పరిచయం చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందని కొనియాడారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను ఈ సందర్భంగా శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కవులు పల్లా వెంకట రామారావు, కాశీవరపు వెంకట సుబ్బయ్య, పుత్తూరు సుబ్రహ్మణ్యం, అనిల్, శివ, గణపతి, వెంకటేశ్వర్లు, కామనూరు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు



లింగాల: అంకెవానిపల్లెలో ప్రత్యేక అలంకరణలో ఎర్రదొడ్డి గంగమ్మ



పెద్దముడియం: పెద్దపసుపుల గ్రామంలో శ్రీ మాధవ స్వామికి గ్రామోత్సవం



ఉగాది సందర్భంగా ప్రత్యేక అలంకరణలో అచ్చవెల్లి గంగమ్మ తల్లి



వేంపల్లె: పంచాంగం పఠిస్తున్న అర్చకులు

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉగాది వేడుకలను వైభవంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా టెంకాయ పందేలు, బండలాగుడు పోటీలను నిర్వహించి ఘనంగా జరుపుకున్నారు. ఈ ఏడాదిలో వర్షాలు బాగా పడి పంటలు బాగా పండి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సింహాద్రిపురం : మండలంలోని నూతన వెంకటేశ్వర స్వామి ఆలయంలో హరిప్రసాద్‌శర్మ పంచాంగ పఠనం చేశారు. భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. అలాగే భక్తులకు ఉగాది విశిష్ట తెలిపి ఉగాది పచ్చడిని ప్రసాదంగా అందజేశారు.

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలో శ్రీక్రోధి నామ తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకుని ఆలయాలలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

పంచాంగ పఠనం

శిల్పారామంలో ఏఓ సుధాకర్ ఆధ్వర్యంలో చంద్రశేఖర్ శాస్త్రి పంచాంగ పఠనం వినిపించారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురుస్తాయని, రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని వివరించారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం

వేంపల్లె : క్రోధినామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని స్థానిక వృషభాచలేశ్వరస్వామి దేవస్థానంకు అనుసంధానం అయిన ఆంజనేయ స్వామి దేవస్థానంలో పంచాంగ పఠనం చేశారు. మంగళవారం అర్చకులు శంకరమంచి ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వృషభాచలేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను గ్రామ పురవీధులగుండా ఊరేగించారు. పంచాంగ శ్రవణం కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కుర్రాకుల వెంకటేశ్, గౌరిదేవి ఆలయ చైర్మన్ నంబూరు కుళ్లాయప్ప, శ్రీకృష్ణ ఆలయ కమిటీ చైర్మన్ డేరంగుల అంజనేయులు, ప్రధాన అర్చకులు హరిప్రవీణ్, ఆలయ సిబ్బంది లక్ష్మిరెడ్డి, శ్రీనివాసులు, రంగప్రసాద్ పాల్గొన్నారు.

లింగాల : లింగాల మండలంలో నూతన తెలుగు సంవత్సరాది శ్రీక్రోధినామ సంవత్సర వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంకెవానిపల్లె గ్రామంలో ఎర్రదొడ్డి గంగమ్మ దేవత ఉత్సవ విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించి గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగాల మండల కేంద్రంలో కుందేళ్ల పారువేటకు యువకులు అడవికి వెళ్లి కుందేళ్లను తీసుకొచ్చారు. బుధవారం పార్నం రోజున కుందేళ్ల పారువేట నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల టౌన్ : ఉగాది పండుగను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం డా.వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకుల్లో ఉత్సాహాన్ని నింపాయి. శ్రీరాజా కళానిలయం చిన్నారులచే మాస్టర్ రాజా ఆధ్వర్యంలో తెలుగుదనంతో ఉట్టిపడే జానపద, కోలాటం, శాస్త్రీయ నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. భరతవేదముగ నిరతనాట్యముగ కదలిన పదమిది ఈశా నృత్యంతో మొదలైన ఈ కార్యక్రమాలు ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా జరిగాయి.

ఏఓ సుధాకర్ పర్యవేక్షించారు.

తొండూరు : స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ఉగాది పండుగను పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆడబిడ్డలతో, బంధువులతో ప్రతి ఇంటిలోనూ పండుగ సందడి నెలకొంది.

పెద్దముడియం: పెద్దపసుపుల గ్రామంలో శ్రీ మాధవ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో ఉగాది వేడుకలు

కమలాపురం : ఉగాది వేడుకలను మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పలు చోట్ల ప్రజలు ఆలయాలను సందర్శించి స్వామి వార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్త ఏడాది అన్ని వర్గాల ప్రజలకు అన్నీ శుభాలు కలగాలని వేడుకున్నారు. కాగా ఆలయాల నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

ఆనందోత్సాహాలతో ఉగాది

వల్లూరు : తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండుగను మండలంలోని ప్రజలు మంగళవారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఉమ్మడిగా డ్రమ్ముల్లో రంగులను కలుపుకుని చల్లుకుంటూ ఉత్సాహంగా వేడుకలను చేసుకున్నారు. ఆలయాలలో ,గృహాలలో ఉగాది పచ్చడి, ప్రసాదాలను పంచి పెట్టారు. దుగ్గాయపల్లె, వెంకటాపురం వీవర్స్ కాలనీలలో వసంతోత్సవాన్ని యువకులు ఉత్సాహంగా జరుపుకున్నారు. పెద్దపుత్త గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో జరిగిన పంచాంగ శ్రవణంలో ప్రభుత్వ పరిశ్రమల సలహాదారులు రాజోలు వీరారెడ్డి పాల్గొన్నారు.



పులివెందుల: పంచాంగం పఠనం చేస్తున్న అర్చకులు



టి.చదిపిరాళ్లలోని అగస్తేశ్వర స్వామి ఆలయంలో పంచాంగం వినిపిస్తున్న అర్చకులు రామకేశవ శర్మ



పులివెందుల టౌన్: నృత్య ప్రదర్శనలో చిన్నారులు



పులివెందుల టౌన్: శాస్త్రీయ నృత్యం చేస్తున్న చిన్నారులు



దుగ్గాయపల్లెలో యువత కేరింతలు

వైభవంగా కొండ గంగమ్మ తిరునాల ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఉన్న కొండగంగమ్మ అమ్మవారు



నందిమండలం కొండ గంగమ్మ వద్ద బండలాగుతున్న ఎద్దులు

పెండ్లిమర్రి : తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకొని మండలంలోని నందిమండలం గ్రామ సమీపంలో వెలసిన కొండ గంగమ్మ తిరునాల ఉత్సవాలు మూడవ రోజు మంగళవారం వైభవంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కాయ కర్పూరాలతో మొక్కులు తీర్చుకున్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

తిరునాల సందర్భంగా ఆలయ కార్యనిర్వాహకులు బండలాగుడు పోటీలను ఏర్పాటు చేశారు. పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీల్లో 13 జతల ఎద్దులు పాల్గొన్నాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు.

చంద్రబాబు హామీలకు మోసపోవద్దు

ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధీర్‌రెడ్డి



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధీర్‌రెడ్డి

కొండాపురం : మూడు పార్టీలు జతకట్టి మీ ముందుకు ఎన్నికల ప్రచారంలో మోస పూరిత హామీలతో వస్తారు ఎవరూ మోసపోవద్దని.. జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని రామిరెడ్డిపల్లె, ఏటూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండికోట జలాశయం కింద ముంపునకు గురైన రెండో విడత గ్రామాల్లో ఏటూరుకు ఎన్నికల సమయంలో చెప్పిన మాట ప్రకారం గండికోట నిర్వాసితులకు రూ.10 లక్షలు పరిహారం అందజేశామన్నారు. మిగిలిన రాని వారికి తప్పకుండా పరిహారం అందిస్తామన్నారు. వచ్చేది మన ప్రభుత్వమే తప్పకుండా న్యాయం చేస్తామన్నారు.రాష్ట్రంలోబడుగు బలహీన వర్గాల వారికి సీఎం వైఎస్ జగనన్నా పెద్దపీట వేశారన్నారు. ఐదేళ్లల్లో పార్టీలు చూడకుండా ప్రతి ఒక్కరికి సంక్షేమం అందించిన మీ బిడ్డను మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాలంటే ప్రతి ఒక్కరు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. గత టీడీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు మోసపూరిత హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని విస్మరించడంతో పాటు జన్మభూమి కమిటీలతో ప్రజలను వేధింపులకు గురిచేసిందని గుర్తు చేశారు. మరోమారు మోసపూరిత మాటలతో ప్రలోభాలకు గురి చేయడానికి టీడీపీ నాయకులు వస్తున్నారని వారి అబద్ధపు మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనతోపాటు ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిను గెలిపించాలని ప్రజలను ఆయన అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో మండల నాయకుడు చింతా రాజారెడ్డి, రాష్ట్ర కనీస వేతనాల సలహా కమిటీ చెర్మన్ ఓంటెద్దు రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, స్థానిక నాయకులు గ్రామ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, అల్లం సత్యం, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు పుణ్యకార్యం



ఇఫ్తార్‌లో దువా చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, తదితరులు

కమలాపురం : పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసాలు పాటించే ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం పుణ్యకార్యం అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సాయినాథ శర్మ, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి తెలిపారు. స్థానిక బీడీ కాలనీలో వైఎస్సార్ సీపీ మైనార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ జిలాన్ బాషా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు వారు హాజరయ్యారు. ఉపవాసాలు పాటించిన ముస్లిం సోదరులకు స్వయానా వారు ఖర్జూర పండ్లు అందించి ఉపవాసాలు విరమింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విందు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. అలాగే రాష్ట్రం అంతా చల్లగా ఉండాలంటే జగనన్న ప్రభుత్వం తిరిగి రావాలన్నారు. వేర్ హౌస్, హజ్ హౌస్ చైర్మన్లు కరీముల్లా, గౌస్‌లాజమ్, మైనార్టీ కమీషన్ స్టేట్ మెంబర్ హిదాయత్, ఎస్సీ పుల్లారెడ్డి, మహ్మద్ సాదిక్, శ్రీనివాసరెడ్డి, మోహన్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి, గఫార్, షావలి, ఖాజా హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోండి



గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న అదనపు బలగాలు

కొండాపురం : సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ప్రొబేషనరి జమ్మలమడుగు డీఎస్పీ శ్రీ కాంత్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సమస్యాత్మక గ్రామం అయిన వెంకయ్యకాలవ గ్రామంలో కేంద్ర సాయుధ బలగాలంతో పోలీస్‌లు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన నిర్వహించారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు సహకరించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ఎటువంటి సమస్య వచ్చినా పోలీస్‌ల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ వేణుగోపాల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చదువుకున్న బడికి మేలు చేద్దాం



వేపరాల పాఠశాలలో పూర్వ విద్యార్థుల కలయిక

జమ్మలమడుగు రూరల్ (మైలవరం): తాము చదువుకున్న పాఠశాలకు అందరం కలసికట్టుగా మేలు చేద్దామని మైలవరం మండలం వేపరాల గ్రామంలో ఉన్న పూర్వ విద్యార్థుల ప్రతినిధి ఉపాధ్యాయుడు నరసింహులు పేర్కొన్నారు. సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాల అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జ్వాలా నరసింహులు మాట్లాడుతూ పాఠశాలలో చదువుకున్న అనేక మంది పూర్వ విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నారన్నారు. బడి రుణం తీర్చుకునేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ఉపాధ్యాయులు నరసింహులు, నాగేంద్ర, గోపాల్‌రావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠం మండలం పలుగురాళ్లపల్లె గ్రామంలో ఇటీవల కాలు విరిగి బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త మొరతోటి రవిని జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి పరామర్శించారు. ఆరోగ్య విషయం తెలుసుకుని వైద్య ఖర్చుల కోసం రూ.20 వేల ఆర్థికసాయం చేశారు. త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రవిని పరామర్శిస్తున్న రామగోవిందరెడ్డి

నేడు కమ్మేటిపల్లి రామయ్య స్వామి తిరునాల







రామయ్య స్వామి, నారాయణ స్వామి, కంటి పాపులమ్మల మూల విరాట్

చింతకొమ్మదిన్నె/కడప వైఎస్ఆర్ సర్కిల్ : మండలంలోని బాలుపల్లె సమీపంలో వెలసిన కమ్మేటిపల్లి రామయ్య స్వామి భక్తుల ఆరాధ్య దైవంగా నిలిచారు. ఆలయంలో వెలసిన రామయ్య స్వామి, నారాయణ స్వామి, కంటిపాపులమ్మలు భక్తుల కోరికలు తీర్చే దైవంగా ప్రజలు భావిస్తుంటారు. ప్రతి సంవత్సరం ఉగాది పండుగ ముగిసిన మరుసటి రోజు కమ్మేటిపల్లి రామయ్య స్వామి తిరునాల నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. బాలుపల్లె, పాపాసాహెబ్ పేట గ్రామానికి చెందిన ప్రజలు నేటికి గుర్రాలను తిరునాల రోజు ఆలయం చుట్టూ తిప్పి స్వారీని నిర్వహిస్తారు.

ఆలయ ఆవరణంలో దాతల సహకారంతో శివాలయం, కాశిరెడ్డి నాయన ఆలయాలను నిర్మిస్తున్నారు. నిత్యం అన్నదాన చేసే విధంగా ఆలయ నిర్మాణాలను చేపడుతున్నారు.

ఫిత్రా దానం తప్పనిసరి



హాఫిజ్ గయాజుద్దీన్

కమలాపురం: ప్రతి ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్ నమాజ్‌కు వెళ్లక ముందే ఫిత్రా దానం చేయాలని హాఫీజ్ సాబ్ గయాజుద్దీన్ తెలిపారు. రంజాన్ మాసం బుధవారంతో ముగియనుంది. నెలవంక కనిపిస్తూనే పండుగ సందడి మొదలవుతుంది. కాగా పండుగ ప్రధాన ఉద్దేశాల్లో ఫితర్ చెల్లించడం ఒకటి. ఈ పండగ పేరే ఈదుల్ ఫితర్. అంటే ఈద్ నమాజ్‌కు వెళ్లకముందే ఫిత్రా చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాదికి 2.50కిలోల గోధుమల (ఫస్ట్ క్వాలిటీ) మార్కెట్ ధర ఎంత ఉంటుందో అంత మొత్తం నగదును ఫిత్రా రూపంలో పేదలకు దానం చేయాలి. ఈ ఏడాది ఫిత్రా మొత్తం రూ.110గా నిర్ణయించారు. అంటే ఒక కుటుంబంలో నలుగురు ఉంటే 440 రూపాయలు పేదలకు దానం చెల్లించాలి. ఆ రోజు పుట్టిన బిడ్డను సైతం సభ్యుడిగా లెక్కించి ఫిత్రా దానం చేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు. నిరుపేదలు సైతం అందరితో పాటు పండగ చేసుకుంటారనేదే దీని ప్రధాన ఉద్దేశం. ఈ ఫిత్రా దానం చేయడం వలన ఏడాది పాటు 70 రకాల రోగాల బారి నుంచి అల్లాహ్ మనల్ని విముక్తి కల్పిస్తారని గయాసుద్దీన్ తెలిపారు. ప్రతి ముస్లిం రంజాన్ పండుగ నమాజ్‌కు వెళ్లక ముందే తప్పని సరిగా ఫిత్రా దానం చేయాలి.

చలివేంద్రం ప్రారంభం



అపస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

పోరుమామిళ్ల: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా భరత మాత రైతుబజార్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. అపస్ జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య చలివేంద్రం వద్ద ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. బస్టాండ్‌కు అనేక ప్రాంతాల నుంచి ప్రయాణికులు వచ్చిపోతూ ఉంటారని, చలివేంద్రం ఏర్పాటు చేయడం వలన దాహార్తి తీర్చుకుంటున్నారు. అపస్ నాయకులు రామకృష్ణారెడ్డి, బాలరంగయ్య, గురుమూర్తి, సుబ్రమణ్యం, రమణ, సుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఓబులేసు పాల్గొన్నారు.